# సీఎం కేసీఆర్‌తోనే దళితుల అభివృద్ధి

- ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాంబారి కొమురయ్య



చిగురుమామిడిలో మాట్లాడుతున్న ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాంబారి కొమురయ్య

చిగురుమామిడి, నవంబర్ 23: దళితుల అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాంబారి కొమురయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలోనే ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో దళితులకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు, రాజకీయాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నది బీఆర్‌ఎస్ మాత్రమేనన్నారు. దళితులు ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడంతో పాటు దాని ఆవరణలో 125అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు, దళిత విద్యార్థుల విదేశీ విద్యకు రూ.25లక్షల సాయం అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్‌దేనన్నారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థుల కోసం రాష్ట్రంలో వెయ్యి గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి, కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్నారని కొనియాడారు. ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో దళితుల సంపూర్ణ మద్దతు బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సతీశ్ కుమార్‌కే ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్, అంబేద్కర్ సంఘం నాయకులు కలువల జయపాల్, చెంచల తిరుపతి, గడ్డం అనిల్, కలువల సంతోష్, ఎనగందుల అనిల్, మహంకాళి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ముమ్మర ప్రచారం



గెర్రెపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సైదాపూర్, నవంబర్23: మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ ప్రచారం ముమ్మరంగా సాగుతున్నది. ఇందులో భాగంగా గురువారం నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కారుగుర్తుకు ఓటేసి హుస్నాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. గెర్రెపల్లి గ్రామంలో ప్యాక్స్‌డైరెక్టర్ కొడిగాని మోహన్‌రావు, నాయకులు దోకిడి తిరుపతి, తిరుపతి, నారాయణ తదితరులు ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించారు. ప్రభుత్వం చేసిన పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

# చిగురుమామిడి ఒడ్డెర కులస్తులు 80 మంది బీఆర్‌ఎస్‌లో చేరిక

చిగురుమామిడి, నవంబర్ 23 : చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన ఒడ్డెర కులస్తులు గురువారం రాత్రి హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సమక్షంలో హుస్నాబాద్‌లో రాత్రి గులాబీ కండువా కప్పుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. సతీష్‌కుమార్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మామిడి అంజయ్య, జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు శివ ప్రసాద్, ఒడ్డెర సంఘం మండల అధ్యక్షులు అల్లెపు సంపత్, యూత్ అధ్యక్షులు పాండు, నాయకులు రాజయ్య, సారయ్య, బోసు, జంపయ్య, వెంకటి, సారయ్య, రమేష్, లక్ష్మణ్, పోచయ్య, రవితో పాటు 80 మంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అభ్యర్థి ఒడితెల సతీశ్‌కుమార్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకుంటున్న ఒడ్డెర కులస్తులు

## పనిచేసే ప్రభుత్వాన్ని గెలిపించాలి

- జడ్పీ వైస్ చైర్మన్ పేరాల గోపాలరావు



మాట్లాడుతున్న జడ్పీవైస్‌చైర్మన్ పేరాల గోపాలరావు

సైదాపూర్, నవంబర్23: సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాలవారికి న్యాయం జరిగిందని, పనిచేసే సర్కారును తిరిగి గెలిపించాలని కరీంనగర్ జడ్పీ వైస్ చైర్మన్ పేరాల గోపాలరావు ప్రజలను కోరారు. గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులకు ఉచితంగా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ సర్కారుదేనన్నారు. రైతులకోసం రైతుబీమా, రైతుబంధు ప్రవేశపెట్టిందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కారుగుర్తుకు ఓటేసి ఆయనను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు ఓపికగా వివరించాలన్నారు. గ్రామాలవారీగా ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనులను తెలుపాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొండ గణేశ్, సర్పంచ్ అబ్బిడి పద్మారవీందర్‌రెడ్డి, నాయకులు ముద్దమల్ల సుధాకర్, ముత్యాల గాంధీయాదవ్, బత్తుల లక్ష్మీనారాయణ, మునిపాల శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- ఎంపీపీ లకావత్ మానస
- పలు గ్రామాల్లో నాయకుల ప్రచారం



మహ్మదాపూర్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎంపీపీ మానస

హుస్నాబాద్ రూరల్, నవంబర్ 23 : హుస్నాబాద్ ఎమ్మెల్యేగా వొడితెల సతీశ్‌కుమార్‌ను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ లకావత్ మానస అన్నారు. గురువారం మండలంలోని మహ్మదాపూర్, భల్లూనాయక్‌తండా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొమ్మిదేండ్లలో హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సతీశ్ కుమార్ అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల కండ్లలో ఆనందం కనబడుతురన్నదన్నారు. వృద్ధులు, దివ్యాంగుకలు ఆసరా పింఛన్లు అందిస్తూ వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. మూడోసారి ప్రజలందరూ కారు గుర్తుకే ఓటు వేసి సతీశ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగం మదన్‌మోహన్, ఎంపీటీసీ పిట్టల నవ్య, గిరిజన సంఘాల నాయకులు లకావత్ తిరుపతినాయక్, సత్యం నాయక్, రాజునాయక్, నాయకులు పాల్గొన్నారు.

## 'సతీశ్‌కుమార్‌ను గెలిపించాలి'



చిగురుమామిడిలో ఈజీఎస్ కూలీలను ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎంపీపీ, నాయకులు

చిగురుమామిడి, నవంబర్ 23: కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ హుస్నాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ కొత్త వినీత కోరారు. గురువారం మండలంలోని చిగురుమామిడి, రాజన్నపల్లె, సీతారాంపూర్, ముల్కనూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను మహిళలకు వివరించారు. చిగురుమామిడిలో ఈజీఎస్ కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆకవరం భవాని, ఉప సర్పంచ్ ముక్కెర పద్మ, బీఆర్‌ఎస్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి అరుణ, వార్డు సభ్యురాలు రజిత, కనకవ్వ తదితరులు పాల్గొన్నారు.

# సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ సతీమణి డాక్టర్ మాధవి



ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తున్న డాక్టర్ మాధవి

హుస్నాబాద్, నవంబర్ 23 : హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పదేండ్ల పాటు నిర్విరామంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ సతీమణి డాక్టర్ మాధవి కోరారు. గురువారం పట్టణంలోని 14వ వార్డులో స్థానిక మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ తిరిగి మహిళలకు బొట్టుపెట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, కౌన్సిలర్లు కొంకటి నళినీదేవి, బోజు రమాదేవి, వాల సుప్రజ, బీఆర్‌ఎస్ నాయకుడు విజయభాస్కర్, అనిత పాల్గొన్నారు.